## క్లుప్తంగా

### ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న నాయకులు

**కద్తాల్:** ఉపాధ్యాయులు ఎక్కడ పనిచేసినా విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ అన్నారు. మండల పరిధి మక్తమాదారం ప్రాథమికోన్నత పాఠశాలలో విధులు నిర్వహించిన ఉపాధ్యాయులు ప్రవీణ్, రోహిణి బదిలీపై వెళ్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆ ఉపాధ్యాయులను నర్సింహ ఆధ్వర్యంలో పలువురు ఘనంగా సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి వారు అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు షాబుద్దీన్, వెంకటేశ్వర్లు, వపన్, నారాయణ, ఉపాధ్యాయులు సంతోష్, లక్ష్మి, సుభాషిణి, మంజుల, విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.

### అర్హులందరికీ రుణమాఫీ



రైతు వేదికలో వివరాలు సేకరిస్తున్న వ్యవసాయ అధికారులు

**మాడ్గుల:** రైతు కుటుంబ సభ్యుల నిర్ధారణ అనంతరం అర్హులైన ప్రతీ రైతుకు ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందని ఏడీఏ అదిలక్ష్మి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఏఓ అరుణ కుమారి ఆధ్వర్యంలో రుణమాఫీ కానీ రైతుల వివరాలను ఆమె సేకరించారు. ప్రత్యేకంగా రూపొందించిన రుణయాప్‌లో సమాచారం నిక్షిప్తం చేశారు. అనంతరం ఏడీఏ మాట్లాడుతూ.. ఆధార్, బ్యాంక్ అకౌంటులో పేరు వేరుగా ఉండి లబ్ధిపొందని రైతులు.. రుణం తీసుకున్న బ్యాంకును సంప్రదించాలని సూచించారు. దీనికి సంబంధించిన ఆధార్ సవరణ చేసే అధికారం ప్రభుత్వం బ్యాంకులకు కల్పించిందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సాగు విస్తరణ అధికారులు వాహినీ, రాజేష్, జోస్న, భార్గవి, ప్రియాంక, రైతులు పాల్గొన్నారు.

### శ్రద్ధగా చదువుకోవాలి

మండల విద్యాధికారి సర్దార్ నాయక్



హాజరు పట్టికలను తనిఖీ చేస్తున్న ఎంఈఓ

**మాడ్గుల:** శ్రద్ధగా చదువుకుని, పదో తరగతి పరీక్షల కోసం విద్యార్థినులు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని ఎంఈఓ సర్దార్ నాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆయన సందర్శించారు. సిబ్బంది, విద్యార్థుల హాజరు పట్టికలు, సామగ్రి, వంటశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో ఎంఈఓ మాట్లాడారు. ఏ రోజు పాఠాలు ఆరోజే చదువుకోవాలని, అర్థం కాని అంశాలను ఉపాధ్యాయులచే నివృత్తి చేసు కోవాలని సూచించారు. అనంతరం బాలికలతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఉపాధ్యాయులతో ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థినిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఇందులో పాఠశాల ఎస్‌ఓ రేఖ, ఏఓబి కోఆర్డినేటర్ లక్ష్మయ్య, ఉపాధ్యాయులు ఉన్నారు.

### పార్టీని మరింత బలోపేతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న గోగిరెడ్డి లచ్చిరెడ్డి

**మంచాల:** బీజేపీని మరింత బలోపేతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోగిరెడ్డి లచ్చిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన శక్తి కేంద్రాల ఇన్‌చార్జీల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో పార్టీ సభ్యత్వ నమోదును విస్తృతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమం పార్టీ నిర్మాణంలో ఒక భాగమని, కమలనాథులు సమష్టిగా బూత్ స్థాయి నుంచి పార్టీ నిర్మాణం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు జంగయ్య గౌడ్, మండల మాజీ ఉపాధ్యక్షుడు భాషయ్య, నాయకులు శ్రీ శైలం, నూకం రాజు, రాజేందర్‌రెడ్డి, రాజు గౌడ్, పాండు, ఐలయ్య, రమేష్, శ్రీశైలం, శేఖర్‌రెడ్డి, బద్దునాయక్ తదితరులు పాల్గొన్నారు.

# కొలువుదీరనున్న గణనాథులు

**నేడు వినాయక చవితి**

- మండపాలు సిద్ధం చేసిన నిర్వాహకులు
- నవరాత్రులు పూజలందుకోనున్న పార్వతీ తనయుడు
- కొనుగోలు దారులతో కిటకిటలాడిన దుకాణ సముదాయాలు
- విగ్రహాలకు పెరిగిన డిమాండ్



ఆమనగల్లు: విగ్రహాలు కొనుగోలు చేస్తున్న ఉత్సవకమిటీ సభ్యులు

**ఇబ్రహీంపట్నం/ఆమనగల్లు:** పార్వతీపరమేశ్వరుల పుత్రుడు గణనాథుడు నేడు కొలువుదీరనున్నాడు. లంబోదరుడికి దండాలు పెడుతూ.. నవరాత్రులు పూజలు అందించేందుకు భక్తులు సమాయత్తమయ్యారు. విఘ్నాలు తొలగించు వినాయక అంటూ మండపాల్లో వెలసిన దేవదేవుడికి విన్నవించే రోజు శనివారం ప్రారంభం కానుంది. ఏ కార్యం తలపెట్టినా ఆది పూజలు అందేది గణపతికే. ఏ వ్రతం చేపట్టినా గణపతి స్తోత్రంతోనే పూజలు ప్రారంభించడం అనవాయితీ.

**ధరలు పైపైకి..**

వినాయక చవితిని పురస్కరించుకుని దుకాణ సముదాయాలు శుక్రవారం భక్తజనంతో కిటకిటలాడాయి. విగ్రహాలు, పూజ సామగ్రి కొనుగోళ్లతో మార్కెట్లలో సందడి నెలకొంది. వివిధ ఆకృతుల్లో రకరకాల రంగుల్లో ఆకర్షణీయమైన గణపతి ప్రతిమలు ఇబ్రహీంపట్నం, ఆమనగల్లు తదితర ప్రాంతాల మార్కెట్లో సిద్ధంగా ఉండగా.. వర్షాన్ని లెక్కచేయకుండా భక్తులు, ఉత్సవ కమిటీ సభ్యులు వాటిని కొనుగోలు చేసేందుకు పోటీపడ్డారు. ధరలు అమాంతం పెంచేసినా.. వెనకాడకుండా విక్రయించారు. వాటితో పాటు మండపాలను అలంకరించే సామగ్రి, పూలు, పండ్లు, పత్రి, పూజ సామాన్లకు డిమాండ్ పెరిగింది.

**జాగ్రత్తలు పాటించాలి**

వినాయక చవితి వస్తుందంటే పక్షం రోజుల ముందు నుంచే పల్లెల్లు, పట్టణాల్లో పండగ వాతావరణం నెలకొంటుంది. చిన్నపెద్ద తేడా లేకుండా ఉత్సవాలను జరుపుకొనేందుకు ప్రజలు సిద్ధమవుతారు. ఈ నేపథ్యంలో జాగ్రత్తగా ఉంటూ.. పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని పోలీసులు, విద్యుత్ అధికారులు సూచిస్తున్నారు.

**అనుమతి తప్పనిసరి**

గణపతి విగ్రహాలను ఎక్కడ ప్రతిష్ఠించినా.. నిర్వాహకులు అనుమతి తీసుకోవాలి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దీంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా.. ఆయా మండపాలపై పోలీసుల నిఘా ఉంటుంది. ప్రశాంతంగా ఉత్సవాలు జరుపుకోవాలి. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు. రాకపోకలకు ఆటంకం కలగకుండా మండపాలను ఏర్పాటు చేసుకోవాలి.

– సత్యనారాయణ సీఐ, ఇబ్రహీంపట్నం

**నిబంధనలు పాటించాలి**

మండపాల వద్ద విద్యుత్ వినియోగానికి శాఖ అనుమతి తప్పనిసరి. విద్యుత్ సరఫరాకు వినియోగించే తీగలు నాణ్యతగా ఉండాలి. ఇనుపరేకులకు తగలకుండా, కిందికి వేలాడకుండా ఏర్పాటు చేసుకోవాలి. ట్రాన్స్‌కో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి.

– శ్రీనివాస్‌రావు, ఏఈ, ఇబ్రహీంపట్నం



ఇబ్రహీంపట్నం మార్కెట్లో మట్టి విగ్రహాల కొనుగోళ్లు



ఇబ్రహీంపట్నం: మండపాల అలంకరణ సామగ్రి దుకాణం



ఇబ్రహీంపట్నం: పత్రి అమ్మకాలు

## ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతా


ఆదిబట్ల పుర అధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న చైర్మన్ నిరంజన్‌రెడ్డి తదితరులు

**ఇబ్రహీంపట్నం రూరల్:** అభివృద్ధిలో ఆదిబట్ల మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. పుర పరిధి ఒకటో వార్డులో శుక్రవారం రూ.11 లక్షలతో సీసీరోడ్లు, అండర్ డ్రైనేజీ పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నానని, ప్రజలకు తాగునీరు, విద్యుత్ సౌకర్యాలతో పాటు ఇతర వసతుల కల్పనకు కృషి చేస్తున్నానని పేర్కొన్నారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు పల్లె గోపాల్‌గౌడ్, కౌన్సిలర్ లావణ్య, కమిషనర్ బాలకృష్ణ, ఏఈ వీరాంజనేయులు, మాజీ సర్పంచ్ రాజు, సాయిబాబగౌడ్, రజినీకాంత్‌గౌడ్, శ్రీశైలం, నర్సింహా, మహేందర్‌రెడ్డి, ప్రభాకర్, నరేందర్‌గౌడ్, కోరే నర్సింహులు పాల్గొన్నారు.

## గణేశ్ ఉత్సవాలకు జేఆర్ ఫ్రెండ్స్ భారీ ఏర్పాట్లు



వినాయక మండపం

**ఇబ్రహీంపట్నం:** గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు పట్నంలోని శ్రీరామ్‌నగర్ కాలనీలో జేఆర్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఘనంగా ఏర్పాట్లు చేసింది. మండపాన్ని భారీగా నిర్మించింది. అసోసియేషన్ ఆధ్వర్యంలో 25 ఏళ్లుగా ఉత్సవాలు నిర్వహిస్తుండటంతో శనివారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మండపం వద్ద నిత్యం లక్ష్మీగణపతి హోమం, అన్నదానం, భజన పోటీలు, భగవద్గీత, రామాయణంపై వ్యాస రచన, తెలుగు పద్యాల, ముగ్గుల పోటీలతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు.

## పరిశుభ్రతతోనే ఆరోగ్యం



రోగులకు మందులు పంపిణీ చేస్తున్న వైద్యులు, నాయకులు

**తలకొండపల్లి:** వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు మన దరి చేరవని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్ అన్నారు. శుక్రవారం మండల పరిధి చీపునుంతల్లో ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఉప్పల.. ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయగా.. వైద్యులు అఖిల్, అనిల్, హైదరాబాద్ కామినేని ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో 243 మందికి బీపీ, షుగర్, కీళ్ల నొప్పులు, జలుబు, దగ్గు, గొంతు నొప్పి, వైరల్ ఫీవర్ తదితర వ్యాధులకు వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నిర్మల, మాజీ ఉప సర్పంచ్ మోహన్‌రెడ్డి, సుధాకర్, శ్రీశైలం, మనోహర్, జానయ్య, యాదయ్య, జ్యోతయ్య, దేవాలయ మాజీ చైర్మన్ శ్రీశైలం, రాఘవేందర్‌గౌడ్, ఆంజనేయులు, శేఖర్, నరసింహ, సుభద్ర, ఆనంద్, శివ తదితరులు పాల్గొన్నారు.

## ఇండియన్ ఆర్మీకి ఘన స్వాగతం



స్వాగతం పలుకుతున్న ప్రజలు

**యాచారం:** ఇండియన్ ఆర్మీకి మండల ప్రజలు శుక్రవారం ఘన స్వాగతం పలికారు. ఆర్మీ ఉన్నతాధికారుల బృందం జమ్ముకశ్మీర్ నుంచి కన్యాకుమారికి సైకిల్‌పై శాంతి యాత్ర నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా హైదరాబాద్ నుంచి నాగార్జునసాగర్ వైపు సాగుతున్న వారి యాత్రకు.. యాచారంలో పోలీసులు, ప్రజలు, అధికారులు, బీజేపీ శ్రేణులు, విద్యార్థులు జాతీయ జెండాలతో స్వాగతం పలికారు. ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులతో ఆర్మీ బృందం కొద్ది సేపు మాట్లాడి, జాతీయ భావాలను తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ దళితమోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కొప్పు భాషా, పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్, నాయకులు గోగికార్ రమేష్, శ్రీధర్‌గౌడ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

**పీసీసీ అధ్యక్షుడికి శుభాకాంక్షలు**

**తలకొండపల్లి:** పీసీసీ నూతన అధ్యక్షుడిగా నియమితులైన మహేశ్ కుమార్ గౌడ్‌కు కాంగ్రెస్ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. పార్టీ అధిష్ఠానం పీసీసీ అధ్యక్షుడిగా మహేశ్‌ను నియమించడం చాలా సంతోషంగా ఉందన్నారు.

**మట్టి విగ్రహాల పంపిణీ**



**ఇబ్రహీంపట్నం రూరల్:** వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకొని ఆదిబట్ల ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం ప్రధానోపాధ్యాయుడు పరమేష్ ఆధ్వర్యంలో గణపతి మట్టి ప్రతిమలను పంపిణీ చేశారు. ఇందులో ఉపాధ్యాయులు భాష, లక్ష్మీదేవి తదితరులు ఉన్నారు.

**విద్యార్థి జీవితం తెల్ల కాగితం**

**తలకొండపల్లి:** విద్యార్థి జీవితం తెల్ల కాగితం వంటిదని ఎంపీడీఓ శ్రీకాంత్ అన్నారు. కాగితాన్ని ఎలా వినియోగించుకుంటే అది ఆ విధంగా మారుతుందని పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎస్సీ వసతి గృహాన్ని ఎంపీఓ రఘుతో కలిసి ఎంపీడీఓ తనిఖీ చేశారు. వసతి గృహ పరిసరాలను, విద్యార్థుల హాజరు శాతం, స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. తాజా కూరగాయలతో వేడివేడి ఆహార పదార్థాలను విద్యార్థులకు వడ్డించాలని నిర్వాహకులను ఆదేశించారు. అనంతరం బ్లాంకెట్స్, షూలు విద్యార్థులకు ఎంపీడీఓ పంపిణీ చేశారు. ఇందులో వార్డెన్ శ్రీనివాసులు, ఏపీఓ కృష్ణ పాల్గొన్నారు.

**పెండింగ్ స్కాలర్‌షిప్ చెల్లించాలి**

**ఇబ్రహీంపట్నం:** పెండింగులో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు శ్రీరామ్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్నంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద, మధ్య తరగతి విద్యార్థులు స్కాలర్‌షిప్, ఫీజు రియంబర్స్‌మెంట్‌పైనే ఆధారపడి విద్యనభ్యసిస్తుంటారని పేర్కొన్నారు. మూడేళ్లుగా ప్రభుత్వం చెల్లించకపోవడంతో బకాయిలు పేరుకుపోయాయన్నారు. త్వరలో జరిగే ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో విద్యరంగ స్థితిగతులపై చర్చించనున్నట్లు వెల్లడించారు.

**పీసీసీ అధ్యక్షుడి నియామకంపై హర్షం**

**ఆమనగల్లు:** పీసీసీ అధ్యక్షుడిగా ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్‌ను నియమించడంతో పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. మహేశ్ నాయకత్వంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతమవుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. మహేశ్ నియామకం పట్ల పార్టీ పెద్దలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

**స్వాగతద్వారం ప్రారంభం**

**బడంగ్‌పేట్:** కార్పొరేషన్ పరిధి బాలాపూర్ 17వ డివిజన్‌లో శుక్రవారం పీఎల్‌ఆర్ కాలనీ స్వాగత ద్వారాన్ని మేయర్ పారిజాత ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పన్నాల సత్యమ్మ, లక్ష్మారెడ్డి జ్ఞాపకార్థం ద్వారాన్ని.. పన్నాల కృష్ణారెడ్డి, జ్యోతిరెడ్డి నిర్మించడం సంతోషంగా ఉందన్నారు.

## చిరు ధాన్యాలు.. ఆరోగ్యానికి మేలు



చిరుధాన్యాలపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ తులసి

**ఇబ్రహీంపట్నం రూరల్:** చిరుధాన్యాలు ఆరోగ్యానికి మేలు చేస్తాయని సీడీపీఓ పట్నం ఇన్‌చార్జి తులసి అన్నారు. పోషణ మాసం సందర్భంగా శుక్రవారం ఆమె ఆదిబట్ల మున్సిపాలిటీ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిరుధాన్యాలను ప్రదర్శించి బాలింతలకు, తల్లులకు, కిషోర బాలికలకు అవగాహన కల్పించారు. అనంతరం తులసి మాట్లాడుతూ.. బాలింతలు, కిషోర బాలికలు పౌష్టికాహారం సక్రమంగా తీసుకోవాలని సూచించారు. ఆహారం బాగా తీసుకోవడం వలన ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. అర్హులందరూ క్రమం తప్పకుండా అంగన్‌వాడీలో అందించే పోషక పదార్థాలను తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆదిబట్ల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పరమేష్, బస్తీ దవాఖాన డాక్టర్ హరికృష్ణ, సూపర్‌వైజర్ సరళ, అంగన్‌వాడీ టీచర్ సుజాత, ఏఎన్‌ఎం, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు

**తుర్కయంజాల్:** అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మున్సిపాలిటీ పరిధి ఉమర్‌ఖాన్ గూడ, తొర్రూర్, మునగనూర్, బ్రాహ్మణపల్లి, కొహెడలో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మరో మూడు నెలల్లో మున్సిపాలిటీ కొత్త కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ, వైస్ చైర్‌పర్సన్ గుండ్లపల్లి హరిత, కమిషనర్ అమరేందర్ రెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

# పురస్కారం బాధ్యత పెంచింది

ప్రముఖ కవి, రచయిత, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ చింతల



అవార్డు అందుకుంటున్న డాక్టర్ చింతల

**సాక్షి, రంగారెడ్డి జిల్లా:** రాష్ట్ర స్థాయి ఉత్తమ అధ్యాపక పురస్కారం తన బాధ్యను పెంచిందని ప్రముఖ కవి, రచయిత ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ చింతల రాకేశ్ భవాని అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. తెలుగు భాషా, సాహిత్య జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొన్న రాకేశ్.. అనేక పత్ర సమర్పణలు చేశారు. 'తెలుగు సినీ గేయ సాహిత్యం, సమకాలీన సమాజ చిత్రణ 1960–70' అంశంపై ఉస్మానియా విశ్వ విద్యాలయం నుంచి 2020లో డాక్టరేట్ పొందారు. 'తానా' ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ మహా కవిసమ్మేళనంలో దేశప్రతినిధిగా పాల్గొని ప్రశంసలు అందుకున్నారు. తెలుగు భాషా చైతన్య సమితి, తెలంగాణ రచయితల సంఘం 2022 కాళోజీ విశిష్ట పురస్కారం సహా అనేక అవార్డులను సొంతం చేసుకున్నారు.

# ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

సీఐ ప్రమోద్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ

**తలకొండపల్లి:** గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ ప్రమోద్ కుమార్ అన్నారు. హిందూ ముస్లింలు సోదర భావంతో నిర్వహించుకోవాలని సూచించారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం ఎస్‌ఐ శ్రీకాంత్ ఆధ్వర్యంలో గణేశ్ మండపాల నిర్వాహకులతో పీస్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. మండపాల రోజువారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. వేడుకల్లో భాగంగా ఏమైనా ఇబ్బందికర సంఘటనలు జరిగితే నిర్వాహకులే బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. రాత్రి పది గంటలలోపు పూజా కార్యక్రమాలు ముగించాలని స్పష్టంచేశారు. మద్యం సేవించి కానీ.. అనుమతి లేకుండా ఏవైనా కార్యక్రమాలు నిర్వహిస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ రంగారెడ్డి, ఎంపీడీఓ శ్రీకాంత్, మాజీ సర్పంచ్‌లు కుమార్, మోహన్‌రెడ్డి, లలిత, జ్యోతయ్య, మాజీ ఉప సర్పంచ్ అనిల్, సజ్జుపాషా, ఆజీమ్, కోటేశ్వర్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులు మార్గ నిర్దేశకులు



టీచర్లను సన్మానిస్తున్న దశరథ్‌నాయక్ తదితరులు

**కడ్తాల్:** సమాజంలో విద్యార్థులను తీర్చిదిద్దే ఉపాధ్యాయ వృత్తి మహోన్నతమైనదని, ఉపాధ్యాయులు సమాజ మార్గ నిర్దేశకులని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలైన, మండల కేంద్రానికి చెందిన నోడల్ అధికారి జంగయ్య (బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం), భీముడు (పీఈటీ, బాలుర ఉన్నత పాఠశాల), జ్యోతిర్మయి (ప్రాథమికోన్నత పాఠశాల) తదితర ఉపాధ్యాయులను శుక్రవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా దశరథ్ నాయక్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తి అన్ని వృత్తుల కంటే ఎంతో గొప్పదని, అలాంటి టీచర్లను సన్మానించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు మరింత బాధ్యతగా పనిచేస్తూ.. విద్యార్థులను మరింతంగా తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ ఎంపీటీసీ లచ్చిరామ్‌నాయక్, మాజీ సర్పంచ్‌లు హరిచంద్, యాదయ్య, సులోచన, సాయిలు నాయకులు వీరయ్య, లాయక్‌అలీ, లక్ష్మన్‌చారి, రాంచంద్రయ్య, కృష్ణ, అంజి, రాఘవేందర్ తదితరులు ఉన్నారు







సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
బి. కిరణ్‌కుమార్
9912220386